★ దసరా బహుమానము ★

శ్రీమతి ఆచంట సత్యవతమ్మ

సుశీల, మాలతి చిన్ననాటి స్నేహితులు. ఒక్క గ్రామంలో పుట్టి, ఒక్కబడిలో చదువుకున్నారు. స్నేహానికి ఏబంధుత్వం చాలదు. మరిచిపోనిది, నిర్మలమైనది, సుహృదలక్షణం. చెడి చెల్లెలింటికి వెళ్లేకంటే స్నేహితు నింటికివెడితే మేలన్నారు. కృష్ణకుచేలులు చిన్ననాటి మిత్రులు. ఒకరు లక్షాధికారి ఒకరు భిక్షాధికారి. అయితేమాత్రం, కృష్ణ పవిత్రస్నేహ భావము, కుచేలుని బాహ్య బీదత్వాన్ని గమనించిందా? నిరాకరించిందా? ఆత్మతత్వ భక్తికి మెచ్చి, సాయుజ్య సౌధాలిచ్చింది.

అట్టి నిర్మల మాధురీ తత్వమే సుశీలది. మాలతి పేదపిల్ల. సౌందర్యవతి. అయితేనేమి. ప్రస్తుత ధన మోహ వరులా సుందరరూపసంపదను త్రోసేశారు. శక్తిలేక మాలతి తలిదండ్రులు మాధవుడనే పేదవిద్యార్థి కిచ్చి పెళ్ళిచేసి ధన్యులయ్యారు. మాధవుడు వారాలు చేసుకొని భుక్తిని యాచించి తెచ్చుకొని జీతముయిచ్చి యెల్లాగో బి. ఎ. అనిపించుకున్నాడు. కాని బి. ఎ. కి పూర్వం ఉన్నగౌరవ ఆదరణలు ఇప్పుడు లేవు. సర్వం తగలేసుకొని చదివి డిగ్రీ సంపాదించుకుని, చంకనెట్టుకొని చవట నౌకరీలకుకూడా సర్వసిద్ధంగా యున్నారు. ఇల్లాయున్నా పిల్లనిస్తామంటే కొల్లలుగా తెల్లబిళ్లలు కావాలి.

మన మాధవుడట్టి బి. ఎ కాదు. విజ్ఞానశాలి. గుణవంతుడు. యోచనపరుడు. చదువుని సార్థకపరచినవాడు. మాలతిని కొబ్బరిబొండంతో కన్యాదానం స్వీకరించాడు. కాని, కాపురానికి భార్యవస్తే గడిచే ఎత్తు చూసుకోవాలి. బడాయికిపోక ఎల్లాగో గొప్పవారి నాశ్రయించి, కలక్టరు కచ్చేరీలో గుమాస్తా గిరి సంపాదించాడు. నెలకు ముప్పైరూపాయిలు జీతం. బ్రతుకుజీవుడా అనుకొని, రెండేండ్లయి, రజస్వలై పుట్టింటబడియున్న మాలతిని కాపరానికి తీసుకొచ్చాడు. మాలతీ మాధవు లేకలతలులేకుండా, శుకదంపతుల్లా కాపరంచేస్తున్నారు.

ఇక మన సుశీలమ్మ సంగతి. సుశీల ఆగర్భ శ్రీమంతురాలు. సిరిసంపదలతో తులతూగుచుండే శాంతమ్మకొడుకు ఐ. సి. యస్. పరీక్ష ప్యాసైయున్న సుందర్రావుకిచ్చి, వేలకువేలు అడక్కపోయినా కట్నమిచ్చి, శాంతమ్మ హోదాకు తగ్గ లాంఛనాలిచ్చి, తూగకలిగిన వాళ్లగుటచేత, మహావైభోగంగా పెళ్లిచేశారు శ్రీనివాసంగారు. ఇద్దరూ బుద్ధివైభోగాల్లో సమానులగుటచే ఏ కలతలులేకుండా సుశీల సుందర్రావుల పెండ్లైంది. మెరకనీరు పల్లానికే, పల్లంనీరు పల్లానికే అన్నట్లుగా లక్షణవంతుల్నే లక్ష్మి ఆశ్రయిస్తుందట.

సుశీల పాదఫలమని చెప్పుళ్లులేకుండా ఆమె కాపరానికి వెళ్లకపూర్వమే సబుకలక్టరు హోదా వచ్చింది సుందర్రావుగారికి. సుశీల అదృష్టం, శాంతమ్మ కడుపుచలవ, రెండూకలిసి ఆరోగ్యభాగ్యాలు ఏకమయ్యాయి. విష్ణువు లక్ష్మీపతి భాగ్యపతి. సుశీలకు పేర్లుతేడేకాని, లక్ష్మీ విష్ణువుల్లాగ కపోత దంపతుల్లాగ యీడుజోడుగా ప్రకాశిస్తున్నా రిజంట.

రాజమండ్రీకి వేశారు సుందర్రావుగారిని. మాధవుని గుమాస్తాపనికి మెచ్చి క్రమంగా హెడ్డు క్లర్కు పోష్టిచ్చారు. ఆయేడు కాంగ్రెసుమంత్రుల మంత్రాంగములో యున్నది పవరు. ఆరోజుల్లో ఖద్దరు కలక్టర్లుకూడా కట్టుకున్నారు. ఖాదీనిషేధము కాంగ్రెసుకులేదు. వారి గవర్నమెంటుకి లేదు. క్రమంగా మాధవుని తెలివితేటలు సుందర్రావుగారి నాకర్షించాయి. తనక్రింద హెడ్ క్లర్కుగా చేర్చుకున్నారు మాధవుని.

కాకినాడలోయున్న మాలతీ మాధవులు, రాజమండ్రి చేరారు. చిన్నయిల్లు అద్దెకితీసుకొని అప్పుసప్పులు లేకుండా తమ జీతానికితగ్గ ఖర్చు వెచ్చాలు చేసికొంటూ కాలం గడుపుచున్నారు. సుశీలా మాలతులు ఎవరి అత్తవారిళ్లకు వారేగింది లగాయితు యింతవరకు తిరిగి కలిసికోలేదు.

కలక్టరుగారికి గుమాస్తాలకు పరిచితియుంటుంది కాని కలక్టరుగారి భార్యకు, గుమాస్తాల భార్యలకు అంతరువు అధికం గనుక, యెరిక యెక్కడనోకాని యుండదు. భోగ్యానికి భాగ్యానికి యెంచుకునేవాళ్లకే యీ తేడా పాడాలుకాని, మనస్సే ముఖ్యమని యెంచే సుగుణశీలులకీ భాగ్య భోగాలొక లెక్కకాదు. ఇందులో చేరింది సుశీలగనుక తనయింట యే వేడుకవచ్చినా, తమ గుమాస్తాలని, భార్యలనుకూడా ఆహ్వానించేది. తాను వారిళ్లకు వెళ్లేది. ఆదర్శప్రాయ.

అప్పట్లో ఆమెయింట కుమారుని పుట్టినరోజు సంబరంచేసారు. గొప్పవారిని, కొద్దివారినికూడా స్వంతంగానే పిలుచుకుంటుందా సుశీలమ్మ. ఆ అలవాటునే, తమ హెడ్ క్లర్కు పెళ్లాన్నికూడా పిలవడానికి కారుమీద వెళ్లింది. కారు తమ గుమ్మందరినాగడం యిదే మొదటిసారి మాలతికి. తీరికసమయంలో రాట్నం త్రిప్పుకుని నూలుతీసుకుంటూన్న మాలతి, కారాగుటచూచి, ఏదో బ్రేకుపడిందో, ఎందుకాగిందో తెలియక తనపనిలో నిమగ్నయై రాట్నగీతంలో మైమరచి, లక్ష్యమంతా దారం తీసేవడుపులో యుంచుకొని, సన్నని కోకిలస్వరంతో "రాట్నమే మన మాటయనుకోండీ! రత్నాల ఏకుల రాట్నమే మన జీవగతియండీ!" అని పాడుకొంటూంది.

సుశీలాదేవి, కలకల్లాడుచు,గలగల్లాడుచు జరీ బుటేదారి పనిచేసిన పాలపిట్టరంగు బనారసుచీరతో, నవ్వు మొగంతో నాదవినోదియగు మాలతికి ప్రత్యక్షమైంది. మాలతి తలెత్తిచూసి చకితయై కొంతసేపు కొయ్యబొమ్మలాచూస్తూ నిలచి, గొప్పవారెవరో వస్తే ఆహ్వానించకుండా యిల్లా నిలబడ్డానేమనుకొని గబగబ మూలనున్న చాపతెచ్చివేసి కూర్చోమని వేడుకొంది. సాక్షాత్తూ లక్ష్మీదేవియే తనమనస్సు పరిశీలించడాని కిలా వచ్చిందేమోయని యనుమానించి, వినయంగా చూస్తూ నిలబడియుంది.

మార్పేమీలేని మాలతి నిట్టే ఆనమాలుపట్టింది సుశీల. తనచెలి దేశసేవా దురంధరత్వానికి, శాంతజీవనానికి సాత్విక దృష్టికి ముగ్ధురాలైంది. తన బాదరబందీకి, చెలి నిశ్శబ్ద గృహానికి తావేలు చూచుకుంటూ

తా వచ్చినపని మరచిపోయింది. పదినిమిషములట్లే మైమరచి, నిలబడుటెందుకమ్మా! ఇటు కూర్చోండీ అని మాలతిని తన చెంత కూర్చోబెట్టుకొని, ముఖానికి బొట్టుపెడుతూ 'మాలతీ! మా అబ్బాయి పుట్టినరోజు రేపు మాయింటికి భోజనానికి, పసుపు బొట్టు తాంబూలాలికి రావలిసుమా!' అని సంబోధించింది.

మాలతి కింకా ఆశ్చర్యమెక్కువైంది. మనస్సు కలవళపడుతోంది. ఎంత జ్ఞప్తికి తెచ్చుకున్నా ఆ వజ్రాలంకారాలమధ్య, ఆ జరీచీరమెరుగుల్లో ప్రకాశిస్తున్న, తన బాల్యచెలి సుశీలను పోల్చలేక తెల్లబోయి చూస్తూ, 'అల్లాగేనండీ' అందెల్లాగో మాటతెచ్చుకొని, కాని ఈవిడనెక్కడో ఎప్పుడో చూసినముఖంలా యుందని అనుమానిస్తూ, ఎవరా! అని ఆలోచిస్తూ, తాంబూలం కుంకంబరిణి తేవడానికి లోపలికెళ్ళింది. మాలతితో సుశీలకూడా వెంటాడిందింటిలోనికి. కూడా వచ్చిన బృందమంతా మన కలక్టరుగారి భార్యకీ పేదరాలేమి బంధువా! యని వితర్కించుకుంటూ విభ్రాంతులై చూస్తున్నారు.

'మాలతీ! నన్ను మరచిపోయావా?' అంది సుశీల. వెనుకనుండివచ్చిన శబ్దానికి మాలతి విభ్రాంతయై వెనుదిరిగి చూచింది. 'నేను సుశీలనుకానా మాలతీ, అప్పుడే మరిచిపోయావా?' అంది తిరిగి. మాలతిమనస్సు అప్పటికి కుదుటపడింది. ఇదేమిటి అంతా తల్లక్రిందులు! ఐశ్వర్యవంతులు నిర్భాగ్యుల్ని మరుస్తారంటారు. నాయెడ అది తారుమారైందేమిటి? రూపం మారింది. భాగ్యంతో అందచందాలెక్కువైయాయి. మార్పుచేత నాబాల్య చెలిని ఆనమాలు కట్టలేకపోతిని. పైవాళ్లువింటే ఏమంటారు? అన్నీయున్న ఆమె యిట్టే పోలిక పట్టి పలకరించింది. కాని, ఏమీలేని ఆవిడ కింత మైకమెల్లాకలిగిందో అని నవ్వుకుంటారేమో, ఎంతపని జరిగిందని, ఖిన్నురాలైంది. కాని ఏమని పల్కరిస్తుంది? పూర్వస్నేహాన్నిపట్టి సుశీలా నువ్వంటుందా? హోదాను పట్టిన్ని పైగా తమ కధికారిణి యగుట మీరంటుందా? మళ్లీ చిక్కులో పడింది. 'క్షమించండి సుశీలగారు!' అంది, ఎల్లాగో ప్రాణాలు బిగపట్టుకొని. అంత సుశీల కౌగలించుకుని, 'ఏమండీ ఏమిటి మాలతీ! నీ నా స్నేహబంధం ముఖ్యంగా ఎంచుకొని మన్నించుచున్నావు. మా హెడ్ క్లర్కుగారి భార్య చాలా యోగ్యురాలని విద్యావతియని వింటూ చూచిపోదామని అనుకుంటూ యీ పిలుపు కార్యంకూడా కలిసి వచ్చుటచేత యీలా రావడం, మా మాలతే మా గుమస్తాగారి భార్య అవడం, ఈరీతిగా దైవానుగ్రహం వల్ల తిరిగి కలిసికోడం కలిగింది. మాలతీ నీవు నీభర్తగారు తెల్లవారేసరికే మాయింటికి రావాలిసుమా! కారంపుతాను. ఆంతర్యంలో నీకు నాకు భేదంలేదు గనుక నాయిల్లు నీయిల్లులాగే భావించి చనువుగా రాక పోకలు చేస్తుండాలి. తప్పకుండా రావాల'ని మరీ మరీ చెప్పి, బొట్టూ తాంబూలం అందికొని సుశీల వెళ్లి పోయింది.

మాలతి సంతోష మింతింతకాదు. రాట్నం మూలపెట్టేసింది. మొగుడొచ్చేసరికె వంటచేసేసింది. పనులన్ని ముగించుకొని, తీసిన దారమంతా రెండు నూలుదండలుక్రింద కట్టింది. అదివరకు తను స్వంతంగా వడికిన నూలుతో నేయించి తెప్పించియుంచిన అరవైనెంబరు కొచ్చిన గుడ్డతో, తనస్వంత మిషనుపై ఒక చొక్కా, ఒకలాగు కుట్టింది. ఒకటోపీ కుట్టింది. చరకాధారంతో అల్లిన బనియను తీసింది. నాల్గుమూర్తులు దారందండలతో కలిపి చిన్నచేతిపెట్టెలో పెట్టింది. తన సాత్వికరూపానికి తగ్గ ఖద్దరు తెల్లచీర ఎర్రంచుది తోపురవిక బైటపెట్టుకుంది. నవ్వుముఖంతో నట్టింట నిలబడి నాధునిరాక కెదురుచూస్తోంది.

ఇంతలో ఆరుగంటలైంది. ఆఫీసుపనితో అలసి మాధవు డింటికొచ్చాడు. మాలతి ఎదురువెళ్లి చొక్కా కండువా లందుకుంది. దాహమిచ్చి, మగనికి ముఖం కాళ్లు కడుక్కొనేటందుకు నీళ్లిచ్చి, అలసట తీర్చింది. ఫలహారాలుచేయని పతికి పెందరాళ భోజనంపెట్టి, ప్రక్కన కూర్చుని మధ్యాహ్నం జరిగిన సంగతంతాచెప్పి మాధవుని ఆశ్చర్య సముద్రంలో ముంచింది. ఒక్కయూరివారు, బాల్యచెలులు, అదృష్టంలో ఎవరికెవరు కర్తలు? అయినా తమ కలక్టరుగారి భార్య నిగర్వచూడామణి అని, బీదసాద హోదాల తేడా లెంచకుండా అందరిని సమానంగా గౌరవిస్తుందని, వింటున్న మాధవుని వినికిడి నిజమైంది, తన పెళ్లాం పట్ల. "ఇప్పటివాళ్లు ధనదాసులు. పెద్దచీరలు,చాలా నగలు పెట్టుకున్న వాళ్లనైనా గౌరవిస్తారు. లేక,టిక్కుటాక్కుమంటూ, కాళ్లకుజోళ్లు కళ్లకు స్పెక్టికల్సు, చేతికి రిష్టువాచి, మెళ్లో నెక్‌లేసొకటివేసుకొని ఇంగ్లీషు మాట్లాడుచూ పకపకనవ్వుచూ, స్నో ముఖాలు వెలవెల్లాడుకుంటూ కుంకంబొట్టుకు నోచుకోని నవనాగరిక బృందాలనైనా గౌరవించి షేకుహాండులిస్తారు, కాని మధ్యరకం సనాతనాచార పసుపుపూత కుంకంబొట్టు పేద ముత్తైదువుల నెవరూ గౌరవించరు. ప్రత్యేకించి పల్కరించరు. నలుగురిలో నారాయణా యంటూ ఓమూల కూర్చొని యిచ్చినమట్టుకు అందుకొని చక్కారావడమే కలుగుతూంటుంది. మా కలక్టరుగారి భార్య యిట్టివారిలో చేరదు."

"అశాశ్వతమగు ఐశ్వర్యమదాంధత ఆమెవద్దలేదు. అందరూ తనింటికే రావాలని అనుకోదు. భగవంతుని సర్వసమానసృష్టిలో కర్మకారణంకాని, కష్టసుఖాలకి, భాగ్యభోగాలకి కర్తలెవరన్న విజ్ఞానవిదుషి. సార్థకనామధేయ.

తెల్లవారింది. మాలతీమాధవులు కాలకృత్యాలు దీర్చుకొన్నారు. ఉన్నంతలో వేషాలుధరించి సిద్ధంగాయున్నారు. ఆనాడు విజయదశమి పండుగగూడాను. అంతకుముందునుంచి కలక్టరుగారింట్లోను దేవీ నవరాత్రులు చేస్తున్నారు కాని, ఆడపిల్లలు లేనందున బొమ్మలకొలువులు, పేరంటాలులేవు. అబ్బాయికా దశమిరోజునే పుట్టినపండుగగుట, ఆవేడుక చేసుకొనుసందర్భంలో ఊరంతా ఉగ్గళించింది సుశీలమ్మ. ఆవేళ వేడుక సందర్భాలు, గొప్పయింటివి వర్ణించాలంటే చాలా పేజీలవుతాయి. అందరి కిట్టివి అనుభవనీయమగునవే గాన, ఊహించుకొంటే కధ పూర్తికి ధన్యవాదాలుచేస్తాను.

మధ్యాహ్నం, పేరంటాండ్రమధ్య నా పంచవర్షప్రాయ బాలుం డందరికి ఆకర్షణీయుడై చుక్కల్లో చంద్రుడులా వెల్గిపోతున్నాడు. ఆ బుటేదారి పనిచేసిన ముఖమల్ డ్రస్సులోనుంచి ఆశీర్వాద అక్షతలు పడ్డాయి. మగువల మంగళారతులయ్యాయి. ధనవంతుల నజర్లు, ఒక్కటీ సుశీల స్వీకరించలేదు. నమస్కారపూర్వకంగా, ముత్తైదులమధ్య నిలచింది సుశీలమ్మ. 'అక్కలారా!'అని సంబోధించింది. "వివాహోపనయన, బారసాల, పుట్టినదినం, తొట్టిల్లోపెట్టు, రజస్వలాదిక సంబరాల్లో యిల్లా తగువులు తెచ్చే ఆచార మిదివరలో గణనీయమే. కాని, ప్రస్తుత దేశ దుర్భర పరిస్థితుల్లో యిట్టి పాత ఆచారాల్ని, ధనసంబంధమైన సకలాన్ని ఖండించితీరాలని నా ప్రార్థన. 'తెచ్చినవి తిరుగకొట్టారు. వీరి గొప్పతనానికి తగవేమో'యన్న దురాలోచనకు పోవలదని నా సోదరీమణులను వేడుకుంటున్నాను. లోతుగా ఆలోచిస్తే, ఇట్టి ఆచారము, అనేక పేదలకు దుఃఖహేతువు. సంతోషపరిస్థితులకు దూరముచేయును. నజర్లు తేలేక ఎంతమందో వేడుకలుచూచు ప్రాప్తికి దూరులై దుఃఖం పొందుతారు. తెస్తే వారిగొప్పకు తగదేమో అన్న పీకులాట. వాళ్లు తెచ్చారు, మనం తేలేకపోయాం కదా యన్న వేదన. యిన్ని అవస్థలు కలిగించే యీ ఆచారం యీ బీద బానిసదేశం లోంచి మనమంతా ఏకీభవించి తరుమకొట్టాలి. గనుక మీరు తెచ్చిన విప్పట్లో నేను పుచ్చుకొన"నని ఘంటా

పథంగా చెప్పి తానిచ్చే పండ్లు, తాంబూలం వాయినాలతోపాటు ఎవరి తగువులు వారికిచ్చేసి మాటలతో వారిని మనోనిర్మలులచేసి సంతోషపెట్టి పంపించివేసెను.

ఇక మన మాలతి తాను తెచ్చిన ఉడుపులెట్లిస్తుంది? అయినా ఇది తగువుకాదని ధైర్యం చిక్కబట్టి బాలునిఒళ్లో యుడుపులుంచి మెళ్లో ఖద్దరుదండవేసి ఆశీర్వాదపూర్వకంగా అక్షతలేసి 'కలక్టరుగారి అబ్బాయికీ ఖద్దరు యుడుపులు 'దసరా బహుమాన'మని చెప్పి అర్పించెను. వెంటనే సుశీల తమ బాలునికా దేశభక్తిచిహ్నమగు ఖద్దరుబట్టలువేసి, భర్తకు చూపించి కాంగ్రెసు కలక్టరుగారి అబ్బాయికి మా చెలి తెచ్చిన దసరా బహుమానమని మేలమాడెను. మరునాడే హెడ్‌క్లర్కు క్యాంపుక్లర్కుగా మారిపోయెను. ఏయూరు వెళ్లినా పాతచెలులు జంటజోళ్లు విడవకుండా తిరుగుచున్నారు.

---

*కన్నీరు

మృతుడగు నామెభర్త గొని మిత్రులుతెచ్చిరి-యొక్క బాష్పమేన్
పతితముకాదు, రోదనము బద్ధగళమ్మును వీడ దాపతి
వ్రత కనుగొంచునుండె తుదివాని- "నిక క్షణమూరకొన్నచో
ప్రిదులును గుండె యీమె" కని ప్రేమచెలుల్ గుసపోయి రందరున్.
పొగడిరి వాని సద్గుణముప్రోవని, ధీరవరుండటంచనిన్
తగిన వరుండటం చతి యుదారస్వభావవు వైరి యంచు స్వా
దుగతి వచోవిశేషముల, తోయ్యలిమాత్రము ఔప్పవాల్ప దిం
తగ చలియింప దందరు వ్యథా భర తాప నిమగ్నలై కనన్.
మెల్లగవచ్చి యొక్కసఖి మిన్నక వీరుని మోముదమ్మిపై
వల్లెదెమల్చె గాని, కని భామిని యేడ్వదు మూర్ఛయైన పో
దుల్లములోన నేమితలపో! చెలులందరకామె యున్కిపై
చెల్లినదాస! చిత్తము కృశించి ఘుభిల్లున గుండెవ్రీలునో!
అనుభవశాలి యొక్కముసలవ్వ కుమారునిదెచ్చి కౌగిటన్
జొనిపిన పాపమాపడతి జోరున వచ్చిన స్వాతివానగా
ననునయవాక్యముల్ వినక హా యని యేడ్చె మెడంద చుల్కగా
కనుగవ నశ్రువుల్ తొలగి కాల్వలుగట్టగ! "తీయనయ్యయో
తనయ! నినుంగురించి యికదక్కితి భూమిని! చచ్చిపుట్టితిన్!"

సామవేదుల చిరంజీవమ్మ.

---

* ఇంగ్లీషులో టెన్నిసన్ కవిదికాబోలు "హోమ్ దే బ్రాట్ హర్ వారియర్ డెడ్" అను పద్యము నకు అనువాదము.